క్లుప్తంగా

నేడు రాజ్యాంగ దినోత్సవం

మునగపాక : మండల కేంద్రంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం జరుగుతుందని అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాగం ఆమోదించిన రోజు అనగా నవంబర్ 26న జరుపుకొంటారన్నారు. ఉదయం 7 గంటలకు దళితవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరగనున్న వేడుకలకు వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యే వేడుకలను విజయవంతం చేయాలని బుజ్జిబాబు కోరారు.

నాని మృతి పార్టీకి తీరని లోటు

మునగపాక : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కర్రి నాని మృతి పార్టీకి తీరని లోటని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ అన్నారు. మండలంలోని పల్లపు ఆనందపురం ఎంపీటీసీ కర్రి అప్పలనరసమ్మ కుమారుడు నాని గుండెపోటుకు గురై ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం పల్లపు ఆనందపురంలో నాని సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమారవర్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాని ఎంతో కృషి చేశారని అలాగే ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి నాని అందించిన సేవలు మరువలేనివన్నారు.నాని కుటుంబ సభ్యులకు ఆయన సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్ తదితరులు సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు.

జంక్షన్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు



నామవరం జంక్షన్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట: డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఫ్యాక్టరీ ఆర్థిక సహకారంతో జంక్షన్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. నామవరం, సత్యవరం, కేశవరం గ్రామాల వద్ద డెక్కన్ కంపెనీకి వాహనాలు ప్రయాణించే రోడ్డు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలను సీఐ అప్పలరాజు, డెక్కన్ కంపెనీ ప్రతినిధి వీరారెడ్డి, ఎస్ఐ బి.జోగారావు ఉన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



దిమిలిలో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

రాంబిల్లి: దిమిలిలో ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. ఈ నెల 28న నిర్వహించే దళ్లమాంబ జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 38 జట్లు తలపడుతున్నాయి. ఈ నెల 28న ఫైనల్ పోటీలు జరుగుతాయని, అదే రోజు విజేతలకు నగదు బహుమతులుతో పాటు మెమెంటోలను అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా శ్రీనివాసరావు



రాంబిల్లి : యలమంచిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా వెల్చూరుకు చెందిన సిరిదెళ్ల శ్రీనివాసరావును నియమించారు. శ్రీనివాసరావు వెల్చూరు ఉప సర్పంచ్‌గా, రాంబిల్లి పీఏసీఎస్ డైరెక్టర్‌గా గతంలో పని చేశారు. శ్రీనివాసరావును పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఎమ్మెల్యే కన్నబాబురాజుకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలి

పాయకరావుపేట: గ్రామాల్లో కాంగ్రెసు పార్టీని బలోపేతం చేయవలసి వుందని, అందుకోసం నాయకులు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో కాంగ్రెసు పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెసు పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



నేను పదేళ్ల వయస్సులో ఉన్నప్పుడు అమ్మనాన్న చనిపోయారు. అప్పటి నుంచి సొంత ఇల్లు లేదు. పూరింట్లో నివాసం ఉంటూ బంధువుల సహాయంతో జీవనం సాగించాను. ఈలోగా జగనన్న ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నిధులు ఇచ్చారు. సొంత ఇల్లు నిర్మాణం చేసుకున్నాను. మరో నెల రోజుల్లో ఇంట్లో దిగుతాను. నేను అనాథగా ఉన్నా జగనన్న ఇంటి స్థలం, నిధులు ఇవ్వడంతో స్వగృహం కట్టుకోగలిగాను. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాను.

గనగళ్ల మహేష్, రేవుపోలవరం, ఎస్.రాయవరం మండలం



ఉమ్మడి కుటుంబంలో ఏళ్లుగా ఒకే ఇంట్లో ఉన్నాం. వివాహం జరిగి 10 ఏళ్లు అయినా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడ్డాం. జగనన్న రాగానే అన్ని సదుపాయాలతో కూడిన లేఅవుట్ ఇచ్చి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు ఇచ్చి ఆదుకున్నారు. మా చిన్న కుటుంబానికి అందమైన ఇల్లు నిర్మించుకున్నాం. మా ఇంటికి సమీపంలో సుమారు 200 మంది ఒకే దఫాలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. కొత్త కాలనీ కాకుండా కొత్త గ్రామంగా మారింది.

చేపల నాగమణి, గృహిణి, కొత్త రేవుపోలవరం

ఇళ్లు కాదు.. ఊళ్లు

గ్రామాలను తలపించేలా జగనన్న కాలనీలు
పేదలకు సొంతింటి కలను సాకారం
చేసిన జగనన్న ప్రభుత్వం
శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



సొంత గూడు లేని పేదలందరికీ గూడు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. పక్కా గృహాలు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చింది. ఒక్కో లబ్ధిదారుకు సెంటున్నర స్థలం ఉచితంగా ఇచ్చి, అందులో పక్కా గృహం నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిన ఘనత సీఎం జగనన్న సొంతం చేసుకున్నారు. జగనన్న లేఅవుట్ల పేరుతో ప్రతి గ్రామంలో సామూహికంగా ఉచితంగా స్థలాలు అందించి, అక్కడే ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఎంతో మంది గూడు లేని వారికి ఈ పథకం ద్వారా సొంతింటి కల నెర వేరింది.



గ్రామంగా దర్శనమిస్తున్న కొరుప్రోలు జగనన్న కాలనీ

మండలంలో మొత్తం మంజూరైన

జగనన్న ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	ఇళ్ల పట్టాలు మంజూరు	పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు	సొంత స్థలాల్లో ఇళ్ల స్కీం మంజూరు
3077	886	1792	552	1285

ఎస్.రాయవరం : దశాబ్దాల కల సాకారమైంది. పేదవాడికి సొంత గూడు దొరికింది. మండలంలో జగనన్న కాలనీలతో కొత్త గ్రామాలు నిర్మాణం అవుతున్నాయి. మండలంలో 1792 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కొరుప్రోలు రెవెన్యూ పరిధిలోనే కొరుప్రోలు, ఎస్.రాయవరం, తిమ్మాపురం, పి.ధర్మవరం, గుర్రాజుపేట, పెదగుమ్ములూరు, గోకులపాడు, పెనుగొల్లు, గుర్రాజుపేట గ్రామానికి చెందిన సుమారు 6 వందలకు పైగా లబ్ధిదారులకు ఒకే చోట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణంతో ఈ ప్రాంతం ఒక పెద్ద గ్రామంగా దర్శన మిస్తోంది. దశాబ్దాలు కాలంగా ఇళ్లు లేక అద్దె నివాసాల్లో ఉంటున్న పేదలు జగనన్న కాలనీలతో శాశ్వత ఇళ్ల నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇచ్చిన స్థలాల్లో ఇందుల్లో 90 శాత లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి 552 మంది నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే సొంత స్థలాలు ఉండి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన వారికి 1285 మంది లబ్ధిదారులు నిధులు కేటాయించేందుకు గృహ నిర్మాణ నిధులు మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి ఇంటి నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో మండలంలో 3077 మందికి ఇళ్ల నిర్మాణ స్కీమ్‌లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 886 మంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు.

త్వరలోనే వెయ్యికి పైగా పూర్తి కానున్న ఇళ్లు

ప్రధాన లేఅవుట్లతో పాటు మండల కేంద్రం , సైతారుపేట, రామయ్యపట్నం, గోకులపాడు, పెనుగొల్లు, జేవీపాలెం , పేటసూదిపురం, పెదగుమ్ములూరు తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలు నిర్మాణాలు ప్రారంభించారు. మరికొన్ని నెలల్లో మరో వెయ్యికి పైగా నిర్మాణాలు పూర్తి కానున్నాయని, దీంతో జగనన్న కాలనీల పేరిట గ్రామాలు నిర్మాణం జరుగుతున్నాయి. మండలంలో కొరుప్రోలు లేఅవుట్‌లతో పాటు, దార్లపూడి, చినఉప్పలం రెవెన్యూ పరిధిలో 300కు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా లేఅవుట్లు సిద్ధం చేశారు.

అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం

జగనన్న లేఅవుట్లల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. లేఅవుట్లలో అంతర్గత రహదారులు, విద్యుత్, డ్రైనేజీల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు, నీటి సదుపాయం కల్పించనున్నది. ప్రతి లబ్ధిదారుకు సిమెంట్, ఇనుము, మార్కెటు రేటు కంటే తక్కువ రేటుకు అందించడమే కాకుండా, ఇసుకను ఉచితంగా అందిస్తోంది.



కొరుప్రోలులో లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టి



చినఉప్పలం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

సొంతింటి కల నెరవేరింది



సొంత ఇల్లు లేకుండా 15 ఏళ్లుగా అద్దె ఇళ్లలో గడిపాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా లాంటి పేదలవైపు చూసినవారు లేరు. జగన్ బాబు చెప్పిన మాట ప్రకారం ఇంటి స్థలం ఇచ్చి, నిర్మాణానికి నిధులు ఇచ్చారు. జీవితాంతం జగన్‌బాబుకు రుణపడి ఉంటాం. అన్ని సదుపాయాలతో ఇంటి స్థలం కేటాయించి నిర్మాణాలకు సహకరించిన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు.

–తోట సరోజిని, గృహిణి, కొరుప్రోలు

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలని...



జగనన్న ఇళ్లు, లేఅవుట్లతో పాటు సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం చేసుకునేటప్పుడు స్కీమ్‌కు అవసరమైన ఎల్‌పీసీలు ఇస్తున్నాం. కొత్తగా స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లేఅవుట్ సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.విజయ్‌కుమార్, తహసీల్దార్, ఎస్.రాయవరం

'జగనన్నకు చెబుదాం'లో స్పందన పట్ల హర్షం



అర్జీదారునికి స్పందన సమాధానం కింద ప్రతి అందజేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారి

మునగపాక : జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తుంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీలకు మంచి స్పందన వస్తుంది. మండలంలోని నాగులాపల్లికి చెందిన కర్రి భాస్కరరావు ఈ నెల 8న మునగపాకలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టికి అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం మీదుగా పరిమితికి మించి భారీ వాహనాలు వెళుతున్నాయని దీంతో రహదారి దెబ్బతినడంతో పాటు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఎత్తు పరిమితి నిరోధకాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన సంబంధిత అధికారులు శనివారం ఫిర్యాదుదారునికి సమాధానం చెబుతూ ప్రతిని అందజేశారు. ఎత్తు పరిమితి నిరోధకాలు ఏర్పాటు చేసేందుకు రూ.2 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారని అర్జీదారుడు భాస్కరరావు తెలిపారు. సమస్య పరిష్కారానికి తీసుకుంటామని అధికారులు చెప్పడం పట్ల భాస్కరరావు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



బైకు ర్యాలీ ఏర్పాట్లపై మాట్లాడుతున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

ఎస్.రాయవరం : మండలంలో పలు గ్రామాల్లో గల ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వమ్మవరం ఉన్నత పాఠశాలల్లో భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులతో సోషల్ స్టాల్స్ ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గుడివాడ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్స విశిష్టత వివరించి నిర్మాణం చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బైక్ ర్యాలీకి ఏర్పాట్లు

రాజ్యాగ దినోత్సవం రోజున మండలంలో ఆదివారం అన్ని గ్రామాల మీదుగా భారీ బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సమతా సైనిక్‌దళ్ సభ్యులు తెలిపారు. గోకులపాడు గ్రామంలో సమతా సైనిక్ దళ్ సభ్యులు శనివారం సమావేశ మయ్యారు. ఆదివారం ఉదయం కొరుప్రోలు గ్రామం నుంచి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బైకు ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. మిగిలిన 27 గ్రామాల మీదుగా బైకు ర్యాలీ నిర్వహించి భారత రాజ్యాంగం పట్ల మరింత అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో సమతాసైనికి దళ అధ్యక్షుడు గారా ప్రకాష్, కార్యదర్శి బి.విజయ్‌కుమార్ సభ్యులు పోలినాటి అప్పారావు, జె.కృష్ణ, జి.శంకర్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కె.నూకరాజు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ తహసీల్దార్ కె.నూకరాజు ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి మాట్లాడారు. ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని, దేశానికి సేవ చేయాలనే బాధ్యత కలిగి వుండాలని ఆయన తెలిపారు. విద్యార్థులకు తాము చేసే నిరంతర సాధనే ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం : పి.ధర్మవరం గ్రామంలో నూకాంబిక అమ్మవారి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వరహానది గట్టున వేంచేసి యున్న నూకాంబిక అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివెళ్లి పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రాత్రికి బుల్లితెర ఆరిస్టులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జగనన్నకే మళ్లీ పట్టం కట్టాలి



ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: సంక్షేమ పథకాల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వడం ద్వారా మరిన్ని పథకాలు అమలవుతాయన్నారు. మండలంలోని అరబుపాలెం సచివాలయ పరిధిలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు,గృహ సారథులు,కన్వీనర్లతో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి,సచివాలయ కన్వీనర్ కూర్మారావు,వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా వెంకటేష్



అచ్యుతాపురం(అనకాపల్లి): యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మడుతూరు సచివాలయ కన్వీనర్ తోట వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తనకు ఈ పదవి ఇప్పించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజుకు వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి

మునగపాక : కేంద్ర ప్రభు త్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు ఆరోపించారు. తోటాడ, గవర్ల అనకాపల్లిలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాకు తరలిరావాలన్నారు.

రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి ఉండాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక భవానీ విద్యా నికేతన్‌లో శనివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని అన్నారు. విద్యార్థులకు రాజ్యాంగంపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం రాజ్యాంగం అంశాలపై పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రామ్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

నక్కపల్లి : గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు చర్చి ఫాదర్‌లు తమ వంతు సహకరించాలని ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. శనివారం సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు క్రిస్టియన్ మతపెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో చాలా మంది బాల్య వివాహాలకు మొగ్గు చూపుతున్నారని, చర్చిలలో ఇటువంటి బాల్యవివాహాలను నిర్మూలించేందుకు మత పెద్దలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి వివాహాలను ప్రోత్సహించేవారికి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీవిద్య, సీడ్ ప్రతినిధులు డేవిడ్, అమ్మాజీ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాక మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ మండలంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) సహాయ, సహకారాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఇంతవరకు కొంతమంది అధికారులు ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రతి ప్రశ్నకు అధికారుల సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలు శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధిని చదివి వినిపించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో సేవలందించాలన్నారు. వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, చిందాడ దేవి, ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ వినయ్‌కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

లింగ వివక్ష విడనాడాలి



మునగపాకలో జాతీయ స్థాయి జెండర్ ప్రచారంలో భాగంగా ర్యాలీ

మునగపాక : లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి జెండర్ ప్రచారంలో భాగంగా శనివారం మునగపాకలో వెలుగు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం కొండమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడ పిల్లలకు విద్య ఎంతో అవసరమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. లింగ వివక్ష తగదన్నారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ప్రగడ అన్నపూర్ణ, కె.మేనకల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీసీలు విజయ, లలిత, ఉష, నాగమణి, అకౌంటెంట్ ఆడారి లక్ష్మి, పలువురువీవోఏలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

పాయకరావుపేట : ఓటరు నమోదుపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ కె.నూకరాజు ఆధ్వర్యంలో పట్టణంలో మెయిన్‌రోడ్డు గుండా ర్యాలీ నిర్వహించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవలసిన యువతీ యువకులు డిసెంబరు మొదటి వారంలోగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి సీఐ పి.అప్పలరాజు సంఘీభావం వ్యక్తం చేశారు.